

మార్వాడీలకు వ్యతిరేకంగా..
మార్వాడీ వ్యాపారులకు వ్యతిరేకంగా వర్తక, స్వర్ణకారుల సంఘాల ఆధ్వర్యంలో జిల్లా బంద్ నిర్వహించారు. - 9లో



పేదల సంక్షేమమే ధ్యేయం
పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. - 9లో



ఉపాధి పనుల జాతర
జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా పనుల జాతర కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. - 9లో

న్యూస్‌రీల్

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు

యాదగిరిగుట్ట: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు, తహసీల్దార్ గణేష్‌నాయక్ సూచించారు. యాదగిరిగుట్ట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం గణేష్ మండప నిర్వాహకులు, ముస్లింలు, వివిధ సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, గణేష విగ్రహాలను తీసుకువచ్చేటప్పుడు, శోభాయాత్ర రోజు విద్యుత్ తీగలు తగలకుండా చూసుకోవాలన్నారు. సోదరభావంతో పండుగ జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో సీఐ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ లింగస్వామి, వైద్యాధికారి పావని, ట్రాఫిక్ సీఐ కృష్ణ, ట్రాన్స్‌కో ఏఈ సురేంద్రనాయుడు, ఎంపీడీఓ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు బస్టాండ్‌లో తప్పిన ప్రమాదం



బస్టాండ్ ఆవరణలో విరిగిన చెట్టు కొమ్మలు

ఆలేరు: పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ఉన్నట్లుండి వేప చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. ఎగ్జిట్ పాయింట్ సమయంలో ఉన్న వేప చెట్టు కింద అప్పటి వరకు పలువురు మాట్లాడుకుంటున్నారు. చెట్ల కొమ్మలు విరిగిపడుతుండగా గమనించి అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది.

ఓపెన్ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, అధికారులు

భువనగిరి: ఓపెన్ స్కూళ్లలో ప్రవేశాలు పెంచాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సూచించారు. గురువారం తన చాంబర్‌లో ఓపెన్ స్కూల్ విద్యకు సంబంధించిన పోస్టర్‌ను విద్యాశాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ కారణాలతో చదువు మధ్యలో నిలిపివేసిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా పూర్తి చేసే అవకాశం ఉంటుందన్నారు. స్వయం సహాయ సంఘాలు, ఉపాధి హామీ కూలీలు, ఆశ కార్యకర్తలు మధ్యలో చదువు మానేసిన వారిని గుర్తించి ఓపెన్ స్కూల్‌లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి నల్లగొండ జిల్లా కో ఆర్డినేటర్ సత్తమ్మ, జిల్లా విద్యాశాఖ ఏడీ ప్రశాంత్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి పెసరు లింగారెడ్డి, వయోజన విద్యా ప్రాజెక్టు అధికారి మమత, సహాయ ప్రాజెక్టు అధికారి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

లోలెవల్ వంతెనలు.. హైలెవల్ కష్టాలు



వలిగొండ మండలం భీమలింగం కత్వ వద్ద లోలెవల్ బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న మూసీ

ప్రమాదకరంగా లోలెవల్ బ్రిడ్జిలు, కల్వర్టులు
- భారీ వర్షాలు కురిసిన ప్రతీసారి వంతెనల పైనుంచి వరద
- స్తంభిస్తున్న రాకపోకలు
- అత్యవసర సమయంలో వాగులు దాటే క్రమంలో ప్రమాదాలు

సాక్షి, యాదాద్రి: భారీ వర్షాలు కురిసినప్పుడలా జిల్లాలోని పలు మార్గాల్లో అవస్థలు తప్పడం లేదు. లోలెవల్ వంతెనలు, కాజ్‌వేలు విస్తరణకు నోచుకోక రాకపోకలు నిలిచిపోతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వరద ఉధృతిలోనే ప్రయాణం సాగిస్తూ ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వాలు మారినా కాజ్‌వే కష్టాలు తీరడం లేదు. మూసీ, ఆలేరు, బిక్కేరు. చిన్నేరు, శామీర్‌పేటతో పాటు పలు స్థానిక వాగులపై సుమారు 60 వరకు కల్వర్టులు, కాజ్‌వేలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇందులో కొన్ని చోట్ల పనులు మొదలై వివిధ దశల్లో ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో అసంపూర్తిగా నిలిచిపోయాయి. కొన్ని కాజ్‌వేలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు.

లో లెవల్ బ్రిడ్జిలున్న మార్గాలు ఇవీ..
మూసీపై రుద్రవెల్లి–జూలూరు, బొల్లెపల్లి–సంగెం వద్ద లో లెవల్ వంతెనలున్నాయి. వీటితో పాటు నలగొండ రోడ్డులో నాగిరెడ్డిపల్లి, పల్లెర్ల, నర్సాపూర్, తుమ్మలగూడెం, లోతుకుంట, నర్సాయిగూడెం. వేములకొండ, మల్లేపల్లి– వేములకొండ, మల్లేపల్లి–వెల్వర్తి, జాలుకాలువ, రెడ్లరేపాక రోడ్డు, బీబీనగర్ మండలం రాఘవాపూర్, జైనంపల్లి రోడ్డు, జైనపల్లి – అనంతారం రోడ్డు, అవుషాపూర్ – రాయరావుపేట, చీకటిమామిడి–మాచన్‌పల్లి, మర్యాల – వడపర్తి, ఫకీర్‌గూడెం – తాజ్‌పూర్, రామలింగంపల్లి–తుముకుంట, గంధమల్ల –రాజాపేట, కోనాపూర్ రోడ్డు, పాముకుంట, రాజాపేట, పారుపల్లి –రాజాపేట, నెమిల – రాజాపేట, దూదివెంకటాపూర్ – రాజాపేట, పొట్టిమర్రి–కాల్వపల్లి, బేగంపేట–రేణికుంట, ఆలేరు – కొలనుపాక, కొలనుపాక జంగాలకాలనీ, కొలనుపాక పీతాంబర్ వాగు, ఆలేరు సిల్క్‌నగర్ వాగు, మంతపురి–దిలావర్‌పూర్, శారాజీపేట, గొలనుకొండ – అమ్మనబోలు, శర్బనాపురం, బండకొత్తపల్లి – వస్తాకొండూరు, వస్తాకొండూరు–పెద్దపడిశాల, మరిపడి – సీతారాంపూర్, వెల్మజాల – కొమ్మాయపల్లి, తంగెడిపల్లి, చౌటుప్పల్ –తంగెడిపల్లి, మోత్కూరు –గుండాల మార్గాల్లో లోలెవల్ బ్రిడ్జిలు, కల్వర్టులు ఉన్నాయి. ఆయా మార్గాల్లో స్థానిక వాగులు, బిక్కేరు, శామీర్‌పేట, ఆలేరు వాగులు ఉధృతంగా ప్రవహించినప్పుడు వంతెనల పైనుంచి రాకపోకలు స్తంభించిపోతాయి.



గత ఏడాది వానాకాలంలో ఓ ప్రయాణికుడు ఆలేరు రోడ్డుపై కొలనుపాక వాగు దాటుతున్న క్రమంలో వరద ప్రవాహానికి కొట్టుకుపోయాడు. స్థానికులు గమనించి సదరు వ్యక్తిని కాపాడారు. ఈ ప్రాంతంలో కొన్నేళ్లుగా ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. అయినా రక్షణ చర్యలు తీసుకోకపోవడం సంబంధిత శాఖల నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తోంది.

మూసీపై ఏళ్లుగా తీరని వెతలు
భువనగిరి మండలం బొల్లేపల్లి, వలిగొండ మండలం సంగెం వద్ద, బీబీనగర్ మండలం రుద్రవెల్లి–భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు మధ్య మూసీపై లోలెవల్ వంతెనలు ఉన్నాయి. ఎగువ ప్రాంతాల్లో, హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసిందంటే లో లెవల్ వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహిస్తుంది. వరద ఉధృతి తగ్గినన్ని రోజులు రాకపోకలు నిలిచిపోతాయి. రుద్రవెల్లి–జూలూరు లోలెవల్ బ్రిడ్జికి సమీపంలోనే ఏడేళ్ల క్రితం చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ఏడాది తన పుట్టిన రోజు సందర్భంగా జిల్లాలో మూసీ పునరుజ్జీవన యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సంగెం బ్రిడ్జిని సందర్శించారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తానని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు.

కొట్టుకుపోయిన కారు
చౌటుప్పల్ మండలం నేలపట్ల–వర్కట్‌పల్లి మధ్య వాగు ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి ఈ మార్గంలో వరద ఉధృతికి రాకపోకలు నిలిచిపోతాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీటిలో కారు కొట్టుకుపోయింది. అందులో ప్రయాణిస్తున్న వ్యక్తులు స్థానికులతో సాయంతో సురక్షితంగా బయటపడ్డారు.

నిధులున్నా పనులేవీ?
ఆలేరు మండలం కొలనుపాకకు రెండు వైపులా సిద్దిపేట మార్గంలో ఉన్న కాజ్‌వేలపై హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కావడంలేదు. గంధమల్ల చెరువు అలుగుపోస్తే కొలనుపాక వాగులోకి చేరుతుంది. ఈ సమయంలో ప్రయాణికులను రోడ్డు దాటనీయదు. దీంతో బచ్చన్నపేట, చేర్యాల, సిద్దిపేట, రాజాపేట మార్గంలో వెళ్లే వాహనాలు చుట్టూ తిరిగిపోవాలి. ధైర్యం చేసి వాగు దాటడానికి ప్రయత్నించిన సందర్భంలో పలువురు కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోగా మరికొందరు స్థానికుల సాయంతో బయటపడ్డారు.

మోత్కూరు–గుండాల మధ్య 50 ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జే దిక్కు
మోత్కూర్–గుండాల మధ్య బిక్కేరు వాగుపై హైలెల్ బ్రిడ్జి నిర్మించకపోవడంతో వాహనదారులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. 50 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన కావడంతో శిథిలావస్థకు చేరింది. వరదలు వచ్చినప్పుడు రోడ్డు దాటడానికి వీలుండదు. హై లెవెల్ బ్రిడ్జి నిర్మిస్తామని పలు సందర్భాల్లో ప్రభుత్వ పెద్దలు హామీలిచ్చినా కార్యరూపం దాల్చలేదు. ఈ వంతెనను విస్తరిస్తే ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల ప్రజలకు 50 కిలోమీటర్ల దూరభారం తగ్గడమే కాకుండా వరదలు వచ్చినా ప్రయాణానికి ఆటంకాలు ఉండవు.



● ఎత్తిపోతల కోసం గొంతెత్తారు



సంస్థాన్ నారాయణపురం : రాచకొండ ఎత్తిపోతల పథకం సాధన కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సంస్థాన్‌నారాయణపురంలో నిర్వహించిన ర్యాలీలో రైతు సంఘం, సీపీఎం నాయకులు, వివిధ గ్రామాల ప్రజలు

నానో ఎరువు.. దిగుబడి మెరుగు

మార్కెట్‌లోకి ద్రవరూప యూరియా, డీఏపీ
- సంప్రదాయ ఎరువులకు ప్రత్యామ్నాయంగా..
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి



త్రిపురారం : మార్కెట్‌లో నానో యూరియా, డీఏపీ అందుబాటులోకి వచ్చాయి. ఇది సంప్రదాయ గుళికల యూరి యాకు బదులుగా వాడే ద్రవరూప ఎరువు. మొక్కలకు నానో యూరియా అధిక నత్రజనిని అందిస్తుంది. నానో టెక్నాలజీని ఉపయోగించి తయారు చేయబడిన ఈ ఎరువు 20 నుంచి 50 మిల్లీ మైక్రాన్‌ల పరిమాణంలో నత్రజని కణాలు ఉంటాయి. దీన్ని మొక్కలు సులభంగా గ్రహిస్తాయి. ద్రవరూపంలోని నానో యూరియా తక్కువ మోతాదులో వాడినా మొక్కలకు ఎక్కువ ప్రయోజనాలను కలిగిస్తుంది. అంతే కాదు పంట దిగుబడిని పెంచి, పర్యావరణానికి మేలు చేస్తుంది.దిగుబడి, రైతుకు ఆదాయం పెంచుతుంది. రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. నానో యూరి యాను సులభంగా నిల్వ, రవాణా చేయవచ్చు.

ధరలు ఇలా..
నానో యూరియాను అన్ని రకాల పంటలకు వాడవచ్చు. ఒక్క బాటిల్ (500 మి.లీ.) వినియోగిస్తే 45 కేజీల బస్తా గుళికల యూరియాతో సమానమని అధికారులు చెబుతున్నారు. 45 కిలోల యూరియా బస్తా రూ.270 కాగా, అర లీటర్ నానో యూరియా రూ.220, డీఏపీ బస్తా రూ.1,350 ఉండగా, అర లీటర్ నానో డీఏపీ రూ.600కు లభిస్తుంది.

వినియోగించే పద్ధతులు
- 500 ఎంఎల్ ద్రవరూప నానో యూరియాను ఎకరం పొలానికి వినియోగించుకోవచ్చు.
- 125 నుంచి 130 లీటర్ల నీటిలో 500 ఎంఎల్ నానో యూరియాను బాగా కలిపి పంటలకు పిచికారీ చేసుకోవాలి.
- ఇతర పురుగుమందులు కలిపి పిచికారీ చేయొద్దు.
- నానో యూరియా వాడకం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చు.
- సాధారణ యూరియతో పోల్చితే నానో యూరియా ప్రభావం మొక్కలపై ఎక్కువ రోజులు ఉంటుంది.
- 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు నానో యూరియాను పిచికారీ చేయాలి.
- యూరియా వేసే ప్రతి పంటలకు నానో యూరియాను వినియోగించుకోవచ్చు.

నానో యూరియాతో ప్రయోజనాలు
భువనగిరి: నానో యూరియా వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయని ఏఓ మల్లేశం, ఏఈఓ ప్రియాంక తెలిపారు. శుక్రవారం భువనగిరి మండలం రెడ్డినాయక్‌తండాలో రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. నానో యూరియా వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని, దిగుబడి పెరుతుందన్నారు. మొక్కలకు సమృద్ధిగా నత్రజని అందుతుందన్నారు. పర్యావరణం, జలవనరులు, భూ కాల్యుష్యం జరగదన్నారు. మెరుగైన పోషక విలువతో కూడిన పంటలను పండించడానికి నానో యూరియా దోహదపడుతుందని పేర్కొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

భోజనం వడ్డించి.. సమస్యలు తెలుసుకొని



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ హనుమంతరావు



విద్యార్థితో ముచ్చటిస్తున్న కలెక్టర్

బీబీనగర్: విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి రుచి, నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు.. కలెక్టర్ హనుమంతురావు. బీబీనగర్ మండలం కొండమడుగు జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు తానే భోజనం వడ్డించారు. సమస్యలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం అందజేయాలని సిబ్బందికి సూచించారు. అడ్మిషన్లు పెరిగే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. తప్పులు లేకుండా 12వ గుణితం చెప్పిన అవినాష్ అనే విద్యార్థిని కలెక్టర్ అభినందించారు. అనంతరం పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేసి రోగులు పొందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్యులు, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు.

అస్తమించిన ఎర్ర సూరీడు

- అనారోగ్యంతో సురవరం సుధాకర్‌రెడ్డి కన్నుమూత
- రెండుసార్లు నల్లగొండ ఎంపీగా సేవలు
- కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు కృషి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి శుక్రవారం రాత్రి మృతిచెందారు. నల్లగొండ జిల్లా సీపీఐ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన సురవరం సుధాకర్‌రెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తుదిశ్వాస విడిచారు. సురవరం పుట్టిపెరిగింది నాగర్‌కర్నూల్ జిల్లా అయినా.. ఆయన ఉద్యమ ప్రస్థానం నల్లగొండ జిల్లాతో ముడిపడి ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో, పార్టీ విస్తరణకు ఆయన కృషిచేశారు. నల్లగొండ జిల్లా నుంచే రాష్ట్ర, జాతీయ స్థాయిలో కీలక పాత్ర పోషించారు. రైతు, కూలీల సమస్యలు, భూస్వామ్య వ్యవస్థ, బానిసత్వం అంశాలపై సీపీఐ తరఫున ఉద్యమాలు నడిపారు. ముఖ్యంగా నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యను రూపుమాపేందుకు జరిగిన కార్యక్రమాల్లో ఆయన ముందున్నారు. ఆయన నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి 1998, 2004లో గెలుపొందారు. ఎంపీగా పనిచేసిన కాలంలో జిల్లా సమస్యలు, ముఖ్యంగా సాగునీటి సమస్యలను పార్లమెంట్‌లో బలంగా ప్రస్తావించారు. కాగా, సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంతో పాటు పలువురు నాయకులు సంతాపం తెలిపారు.



2024 డిసెంబర్ 30న నల్లగొండలో జరిగిన సీపీఐ శత వసంతాల సభలో మాట్లాడుతున్న సురవరం సుధాకర్‌రెడ్డి పక్కన, డి. రాజా, పల్లా



సురవరం సుధాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న జానారెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, నెల్లికంటి సత్యం, చిత్రంలో విజయలక్ష్మి (ఫైల్)



భువనగిరిలోని విద్యానగర్‌లో విద్యుత్ స్తంభం పైనుంచి కింది వరకు నెట్, టీవీల వైర్లు

మృత్యుపాశాలు..

కరెంట్ పోల్స్‌కు ఇష్టారాజ్యంగా ఇంటర్‌నెట్, కేబుల్ టీవీల వైర్లు
- తక్కువ ఎత్తులో అడ్డదిడ్డంగా ఏర్పాటు చేస్తున్న ఆపరేటర్లు
- పొంచి ఉన్న ప్రమాదాలు.. స్తంభాలపై సమస్య తలెత్తినా మరమ్మతులు చేయలేని పరిస్థితి
- తొలగించాలని గతంలోనే ఉన్నతస్థాయి ఆదేశాలు
- హైదరాబాద్ ఘటనతోనూ మేల్కోని యంత్రాంగం



స్తంభాలపై గజిబిజిగా వైర్లు..

భువనగిరి టౌన్: ప్రైవేట్ సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ స్తంభాలను తమ సొంతానికి వాడుకుంటున్నాయి. విద్యుత్ సరఫరా కోసం రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన స్తంభాల ద్వారా ఇంటర్నెట్, కేబుల్ టీవీ సంస్థలు ఇష్టారాజ్యంగా కేబుళ్లను అనుసంధానిస్తున్నాయి. ఫలితంగా ఈ వైర్లు తెగి కరెంటు లైన్లు, స్తంభాలపై పడినప్పుడు విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అంతేకాకుండా స్తంభాలపై ఏదైనా సమస్య తలెత్తినప్పుడు ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు చేయలేకపోతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో టీవీ, ఇంటర్‌నెట్ కేబుల్స్ వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగి ఐదుగురు మృతి చెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. కేబుల్స్ తొలగించాలని విద్యుత్ శాఖ ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

ఏ స్తంభానికి చూసినా గుట్టలుగా కేబుల్స్
ప్రైవేటు సంస్థల కేబుల్ విస్తరణ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగుతోంది. భువనగిరి పట్టణంలో త్రీ ఫేజ్, టూఫేజ్, చివరికి హైటెన్షన్ స్తంభాలను కూడా అనధికారికంగా వాడుకుంటున్నారు. నిబంధనల ప్రకారం 15 అడుగుల ఎత్తులో కేబుల్స్ ఉండాలి. కానీ, తక్కువ ఎత్తులో లాగడంతో కిందకు వేలాడుతున్నాయి. అంతేకాకుండా వైర్లను కుప్పలుగా స్తంభాలకు చుట్టేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు ఇష్టారాజ్యంగా స్తంభాలను కేబుళ్ల కోసం వాడుకుంటున్నారు.

విద్యుత్ సిబ్బందితో కుమ్మక్కు!
ఇంటర్‌నెట్, కేబుల్ టీవీల తీగలు వేయడానికి స్తంభాలను ఉపయోగించినప్పుడు విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలి. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో స్తంభం చొప్పున నిర్దేశిత రుసుము చెల్లించాలి. కానీ, చాలా చోట్ల అమలు కావడం లేదు. కొందరు యజమానులు విద్యుత్ సిబ్బందితో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా వైర్లు ఏర్పాటు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

వాహనాలు వెళ్లిన సమయంలో ప్రమాదాలు
ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లోని కాలనీల్లో చిన్నచిన్న రోడ్లపై ఒకవైపు ఇళ్ల నుంచి మరోవైపున ఉన్న నివాసాలకు కేబుళ్లను రోడ్డుకు అడ్డంగా లాగుతున్నారు. ఇవి తక్కువ ఎత్తులో ఉంటే వాహనాలు వెళ్లిన సమయంలో వాటికి తగిలి తెగిపోతున్నాయి. విద్యుత్‌లైన్లు, స్తంభాలపై పడి వేలాడుతున్నాయి.

నోటీసులతోనే సరిపెట్టారు.. టీవీలు, ఇంటర్‌నెట్ వైర్లను తొలగించాలని ఆయా సంస్థల యజమానులకు ఏడాది క్రితం విద్యుత్ శాఖ నోటీసులు జారీ చేసింది. కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆ తరువాత వాటి గురించే మరిచిపోయింది. ఈనెల 27నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు, ఆ తరువాత దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు వరుసగా రానున్నాయి. నిర్వాహకులు భారీ విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు సిద్ధమవుతున్నారు. నిమజ్జనం సందర్భంగా విగ్రహాల ఊరేగింపు ఉంటుంది. ఈ తరుణంలో కిందకు వేలాడుతున్న తీగల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. తక్షణమే కేబుల్ టీవీలు, ఇంటర్నెట్ సంస్థల కేబుల్స్‌ను తొలగించాలని ప్రజలు, ఉత్సవ మండపాల నిర్వాహకులు కోరుతున్నారు.





కిసాన్‌నగర్‌లో విద్యుత్ స్తంభాలకు కుప్పలుగా చుట్టి ఉన్న వైర్లు

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..
- విద్యుత్ స్తంభాల ద్వారా ఇంటర్నెట్, కేబుల్ టీవీ సంస్థలు వైర్లు లాగాలంటే అనుమతి తప్పనిసరి.
- ఒక్కో స్తంభానికి రూ.50 నుంచి రూ.100 చెల్లించాల్సి ఉంటుంది.
- కనీసం 15 అడుగుల ఎత్తులో కేబుల్స్ ఏర్పాటు చేసుకోవాలి.
- సపోర్టింగ్ వైర్, కేబుల్ బరువు మీటరుకు గరిష్ఠంగా 200 గ్రాములు మించవద్దు.
- తీగ పొడవు స్తంభానికి, స్తంభానికి మధ్య 50 మీటర్లు మించకుండా ఉండాలి.
- అనుమతి లేకుండా ఏర్పాటు చేసినవి, తక్కువ ఎత్తులో ఉన్నవి, ప్రమాదకరంగా ఉన్న తీగలను అధికారులు ఎప్పటికప్పుడు తొలగించాలి.

క్లుప్తంగా

మూసీకి తగ్గిన ఇన్‌ఫ్లో

• ఒక గేటు ద్వారా నీటి విడుదల



మూసీ ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతా నుంచి వస్తున్న వరద ఉధృతి తగ్గింది. మూసీ రిజర్వాయర్‌కు శుక్రవారం 3,498 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. దీంతో ప్రాజెక్టు అధికారులు ఒక క్రస్టు గేటును రెండు అడుగుల మేర పైకెత్తి 1230 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 527 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ ప్రాజెక్టులో గరిష్ఠ నీటిమట్టం 645 అడుగులు కాగా శుక్రవారం సాయంత్రం వరకు నీటిమట్టం 643.35 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలుకు గాను ప్రస్తుతం 4.03 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి వృద్ధుడు మృతి

కొండమల్లేపల్లి(చింతపల్లి): ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన చింతపల్లి మండలం తిరుమలాపురం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలాపురం గ్రామానికి చెందిన గార్లపాటి రాములు(82) ఇంట్లో ఒంటరిగా ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి రాములు ఇంట్లో నిద్రించగా.. శుక్రవారం తెల్లవారుజామున గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు కూలిపోయింది. చుట్టుపక్కల గమనించి జేసీబీని పిలిపించి ఇంటి శకలాలను తొలగించగా రాములు మృతిచెంది ఉన్నాడు. మృతుడి మనవడు ప్రవీణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నవీన్‌కుమార్

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొర్రోనితండాలో సోమవారం రాత్రి కొర్ర పట్టి ఇంట్లో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని కొండమల్లేపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొర్రోనితండాకు చెందిన కేతావత్ బద్య సోమవారం రాత్రి అదే తండాకు చెందిన కొర్ర పట్టి ఇంటి తాళాలు పగులగొట్టి కేజీ వెండి, రూ.1.50లక్షల నగదు అపహరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా దేవరకొండ ఏఎస్పీ మౌనిక ఆధ్వర్యంలో సీఐ నవీన్ కుమార్, ఎస్‌ఐ అజ్మీరా రమేష్ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి బద్యను అదుపులోకి తీసుకుని విచారించగా.. దొంగతనం చేసినట్లు నిజం ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి అపహరించిన సొత్తును స్వాధీనం చేసుకుని, జైలుకు తరలించినట్లు న్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న సీఐ నవీన్‌కుమార్, ఎస్‌ఐ అజ్మీరా రమేష్, క్రైమ్ సిబ్బంది హేము నాయక్, భాస్కర్‌ను నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

సాగు జలాలు ఇచ్చే వరకు పోరాడాలి

• అఖిల భారత రైతు సంఘం జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి



సంస్థాన్ నారాయణపురంలో ర్యాలీ తీస్తున్న రైతు సంఘం నాయకులు తదితరులు

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం ప్రాంతానికి సాగు జలాలు అందించే ఇక్కడి ప్రజలు పోరాడాలని అఖిల భారత రైతు సంఘం జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో రాచకొండ ఎత్తిపోతల పథక సాధన సదస్సును శుక్రవారం సంస్థాన్ నారాయణపురంలో నిర్వహించారు. ఈ సదస్సులో రిటైర్డ్ ఇంజనీర్ ఫోరం నాయకుడు పి. ఇంద్రసేనారెడ్డి పాల్గొని రాచకొండ ఎత్తిపోతల పథకానికి నీళ్లు ఎలా తీసుకురావచ్చనే డీపీఆర్‌ను వివరించారు. ఈ సందర్భంగా సారంపల్లి మాల్లారెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని చిన్న చిన్న ప్రాజెక్టులకు రూ.500కోట్ల చొప్పున కేటాయిస్తే పూర్తయ్యే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నిధులు కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌లో ఇరిగేషన్‌కు రూ.22,304 కోట్లు కేటాయించి, అందులో రూ.10వేల కోట్లు ప్రాజెక్టుల నిర్మాణం కోసం వెచ్చించారని, మిగిలిన బడ్జెట్‌లో రూ.800 కోట్లు వేతనాలకు, రూ.11,500 కోట్లతో వడ్డీలు చెల్లిస్తున్నారని అన్నారు. మూసీ నది ప్రక్షాళన కోసం ప్రభుత్వం రూ.15వేల కోట్లు వెచ్చిస్తామని చెప్పి రూ.1500 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. మూసీ ప్రక్షాళన కంటే ముందు హైదరాబాద్ నుంచి కాలుష్యం కారక కంపెనీ తరలించాలని డిమాండ్ చేశారు. ఎరువుల కొరతకు కారణం వ్యవసాయ శాఖ మందస్తు ప్రణాళికలు రూపొందించకపోవడమేనని అన్నారు. మునుగోడు నియోజకవర్గానికి నీళ్లు ఎక్కడ నుంచి తెస్తారో తీసుకురావాలి కాని, అలోచనలు



రాచకొండ ఎత్తిపోతల డీపీఆర్‌ను వివరిస్తున్న రిటైర్డ్ ఇంజనీర్ ఫోరం నేత ఇంద్రసేనారెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

మార్చుతూ కాలయాపన చేయొద్దన్నారు. సాగు జలాలు అందించే వరకు దీర్ఘకాలిక పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ నుంచి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు అరాచక పాలన కొనసాగిస్తున్నాయని అన్నారు. రిటైర్డ్ ఇంజనీర్ ఫోరం నాయకుడు పి. ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. రాచకొండ ఎత్తిపోతల పథకానికి కృష్ణా, గోదావరి జలాలు అందించే అవకాశాలను వివరించారు. ఈ పథకం నిర్మాణం పూర్తయితే ఎన్ని మండలాలకు సాగు జలాలు అందుతాయని వివరించారు. అంతకుముందు నారాయణపుంర చౌరస్తా నుంచి సదస్సు నిర్వహించే ప్రదేశం వరకు ర్యాలీ నిర్వంచారు. ఈ సదస్సులో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, సుర్కంటి శ్రీనివాస్‌రెడ్డి, గుంటోజు శ్రీనివాస్‌చారి, దోడ యాదిరెడ్డి, దోనూరి నర్సిరెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, దొంతగోని పెద్దులు, ఐతరాజు గాలయ్య, మల్లేపల్లి లలిత, చింతకాయల నర్సింహ, రాములు, నరసింహ, యాదవరెడ్డి, శంకరయ్య, భిక్షం, నిర్మాల, అమరేందర్ తదితరులున్నారు.

మునగాలలో క్లినిక్ సీజ్

మునగాల: మండల కేంద్రంలోని ఆర్ఎంపీ చంద్రమౌళి నిర్వహిస్తున్న క్లినిక్‌ను శుక్రవారం జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్ సీజ్ చేశారు. ఆర్ఎంపీ చంద్రమౌళి చేసిన వైద్యం వికటించడంతోనే ఈనెల 5న మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన గోవింద వెంకటేశ్వర్లు మృతి చెందాడని బాధిత కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మునగాల పోలీసులు కేసు నమోదు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ జయమనోహరి క్లినిక్‌తో పాటు అనుబంధంగా ఉన్న అమ్మ రక్తపరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. పరిమితికి మించి వైద్యం చేయొద్దని, అనవసరంగా యాంటిబయాటిక్ మందులు వినియోగించొద్దని హెచ్చరించారు. అయినా చంద్రమౌళి క్లినిక్‌లో యథావిధిగా వైద్యం చేస్తున్నాడని సమాచారం అందుకున్న జిల్లా వైద్యాధికారి



క్లినిక్‌ను సీజ్ చేస్తున్న వైద్యసిబ్బంది

చంద్రశేఖర్ తన సిబ్బందితో కలిసి క్లినిక్‌ను సీజ్ చేయడంతో పాటు అమ్మ రక్తపరీక్ష కేంద్రం నిర్వాహకుడికి నోటీసు జారీ చేశారు. జిల్లా వైద్యాధికారి వెంట సూర్యాపేట డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ చంద్రశేఖర్, కోదాడ డిప్యూటీ డీఎంహెచ్ఓ జయమనోహరి, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవీందర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

అర్ధరాత్రి చోరీకి యత్నం

చిలుకూరు: చిలుకూరు మండల కేంద్రలో నివాసముంటున్న డ్రైవర్ నాగయ్య ఇంట్లో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి చోరీకి యత్నించాడు. రాత్రి ఒంటి గంట సమయంలో నాగయ్య మూత్ర విసర్జనకు వెళ్లేందుకు తలుపు తీయగా.. గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడ్డాడు. నాగయ్య మనవరాలి చెవికి ఉన్న బంగారంతో పాటు ఇంట్లోని బంగారు ఆభరణాలు, డబ్బులు దొంగిలించేందుకు యత్నించాడు. ఈలోగా నాగయ్య ఇంట్లోకి రావడంతో దొంగ పరారయ్యాడు. అంతకుముందే నాగయ్య ఇంటి సమీపంలోని మరో ఇంట్లో ఆ దొంగ చొరబడి సెల్‌ఫోన్ చోరీ చేశాడు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాగయ్య ఇంటి సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా దొంగ ఆటోలో పరారైనట్లు గుర్తించారు.

సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ రమేష్

రామగిరి(నల్లగొండ): సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలని నల్లగొండ ఏఎస్పీ జి. రమేష్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్స్, ఎన్‌సీసీ, పీస్ ఫోరం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఎస్పీ రమేష్, సైబర్ క్రైం డీఎస్పీ టి.లక్ష్మీనారాయణ, మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. పి.మద్దిలేటి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరాల్లో ఎక్కువగా మొబైల్ ద్వారా జరుగుతున్నాయన్నారు. ప్రజలు జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో పీస్ ఫోరం ట్రస్ట్ ఫౌండర్ హెచ్. దయానంద, తెలుగు శాఖ అధ్యక్షుడు డా. వెల్దండి శ్రీధర్, పీస్ ఫోరం సభ్యులు అశోక్‌వర్ధన్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ సీహెచ్. సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ నర్సింగ్ కోటయ్య, ఎం. వెంకట్‌రెడ్డి, డాక్టర్ ఏ. మల్లేశం, డాక్టర్ బొజ్జ అనిల్‌కుమార్, కె. శివరాణి, ఎం. సావిత్రి, ఎన్ఎస్ఎస్ వలంటీర్స్, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

ఆలేరురూరల్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన శక్రవారం ఆలేరు మండలం మంతపురి గ్రామంలో చోటుచేసుకుంది. ఆలేరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంతపురి గ్రామానికి చెందిన సాప్పోజు కృష్ణచారి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి బీరువాలోని రూ.70వేల నగదు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటికి తిరిగొచ్చిన కృష్ణచారి, కుటుంబ సభ్యులు తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యాలాద్రి తెలిపారు.

మోటారు కేబుల్ వైర్లు..

తిప్పర్తి: తిప్పర్తి మండల పరిధిలోని మర్రిగూడెం గ్రామ సమీపంలో రైతుల పొలాల వద్ద బోరు మోటార్ల కేబుల్ వైర్లను గుర్తుతెలియని అపహరించారు. సుమారు 30మంది రైతులకు సంబంధించిన కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు శుక్రవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవోత్సవం నేత్రపర్వంగా చేపట్టారు. శుక్రవారం సాయంత్రం అమ్మవారిని బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో అమ్మవారికి స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని అద్దాల మండపంలో అధిష్ఠింపజేసి ఊంజలి సేవోత్సవం నిర్వహించారు. ఇక ప్రధానాలయంలో సంప్రదాయ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. వేకుజామున సుప్రభాత సేవ, ఆరాధన, గర్భాలయంలో స్వయంభూలకు అభిషేకం, సమస్రనామార్చాన తదితర పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో ఆండాళ్ అమ్మవారు

ఘనంగా మరియమాత ఉత్సవాలు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని మరియరాణి చర్చిలో మరియమాత ఉత్సవాలను శుక్రవారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ కరణం ధమన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దివ్యబలి పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏసు ప్రభువు తల్లి మరియరాణి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. సాయంత్రం మరియరాణి స్వరూపాన్ని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ బిషప్ గణ గోవింద్ జోజి, విచారణ ఫాదర్ జి. బాలస్వామి, అల్లారెడ్డి, బాలరాజు, చర్చి పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థన చేస్తున్న బిషప్ ధమన్‌కుమార్

రైతులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి

• నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్‌భాస్కర్



అయిటిపాములలో ఎలక్ట్రికల్ వెహికల్ చార్జింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న సీజీఎం ఉదయ్‌భాస్కర్

కట్టంగూర్: రైతులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకొని వ్యవసాయంలో అధిక లాభాలు గడించాలని నాబార్డు తెలంగాణ రీజియన్ చీఫ్ జనరల్ మేనేజర్ బి. ఉదయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామంలో కట్టంగూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్(ఎఫ్‌పీఓ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎలక్ట్రికల్ వెహికిల్ చార్జింగ్ స్టేషన్‌ను, ఆఫ్‌గ్రిడ్ సోలార్ సిస్టమ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గంగదేవిగూడెంలోని ఎఫ్‌పీఓలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. సోలార్ ప్యానల్‌తో విద్యుత్‌ను స్టోరేజీ చేసి ఆదాయం సంపాదించేందుకు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో సోలార్ బ్యాటరీ యూనిట్లు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎఫ్‌పీఓలు రైతులకు అన్నిరకాల సౌకర్యాలు అందిస్తూ వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడుతున్నాని తెలిపారు. ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించబోయే కృషి వికాస్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం నిరుద్యోగ యువతకు మేలు చేస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రాణధార ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొని రైతులకు డైరెక్ట్ సీడ్ రైస్(డీఆర్ఎస్) పద్ధతిపై సూచనలు, సలహాలు అందించారు. రాబోయే రబీ సీజన్‌లో డీఆర్ఎస్ పద్ధతిలో 100 ఎకరాలు సాగు కోసం అవసరమైన మిషన్లు ఉచితంగా అందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డు నల్లగొండ డీడీఎం వినయ్‌కుమార్, సూర్యాపేట డీడీఎం రవీందర్‌నాయక్, ఎఫ్‌పీఓ అడ్వైజర్ నంద్యాల నర్సింహారెడ్డి, ఎఫ్‌పీఓ చైర్మన్ చెవుగోని సైదమ్మ, ఐఆర్‌డీఎస్ అధ్యక్షుడు రమేష్, స్వచ్ఛ శక్తి సుధాకర్, శేఖర్ ఉన్నారు.

డీసీసీబీని సందర్శించిన నాబార్డు సీజీఎం



సమావేశంలో పాల్గొన్న నాబార్డు సీజీఎం ఉదయ్‌భాస్కర్, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్: నల్లగొండలోని డీసీసీబీని శుక్రవారం నాబార్డు సీజీఎం ఉదయ్‌భాస్కర్ సందర్శించారు. ఆయన డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాబార్డు స్కీంలు, డీసీసీబీల అభివృద్ధిలో నాబార్డు పాత్ర వంటి విషయాలపై సీజీఎం మాట్లాడారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. నాబార్డు అందిస్తున్న అనేక పథకాలు, రీఫైనాన్స్‌తో డీసీసీబీలు, సొసైటీలు బలోపేతమయ్యాయన్నారు. ఉమ్మడి జిల్లాలో మరో ఆరు కొత్త బ్రాంచీల ఏర్పాటు, ప్రాథమిక సహకార సంఘాలకు గోదాంల నిర్మాణానికి కొత్త స్కీమ్‌లు ఏర్పాటుచేయాలని ఈ సందర్భంగా సీజీఎంను ఆయన కోరారు. సమావేశంలో డీసీసీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, శంకర్‌రావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పట్టపగలే ముగ్గురిపై హత్యాయత్నం

• ప్రాణ రక్షణ కోసం వైన్స్‌లోకి పరిగెత్తిన బాధితులు



పోలీస్ స్టేషన్‌లో లక్ష్మయ్య, అతడి భార్యలు

చివ్వెంల(సూర్యాపేట): పట్టపగలే భర్త, అతడి ఇద్దరు భార్యలపై కర్రలతో దాడి చేసి హతమార్చేందుకు నలుగురు వ్యక్తులు యత్నించారు. ఈ ఘటన చివ్వెంల మండలం బీబీగూడెం గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం అక్కలదేవిగూడెం గ్రామానికి చెందిన దండుగల లక్ష్మయ్యకు 2002లో నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పారెపల్లి గ్రామానికి చెందిన వెంకటమ్మతో వివాహం జరిగింది. వారికి సంతానం కలగకపోవడంతో వెంకటమ్మ సోదరి పద్మను 2008లో లక్ష్మయ్య రెండో వివాహం చేసుకన్నాడు. రెండో వివాహం చేసుకున్న తర్వాత లక్ష్మయ్య మొదటి భార్య వెంకటమ్మ గర్భం దాల్చింది. దీంతో ఇద్దరు భార్యలతో కలిసి వడ్డెర పనులు చేసుకుంటూ లక్ష్మయ్య జీవనం కొనసాగిస్తున్నాడు. 2023లో కుడకుడ గ్రామానికి చెందిన శేఖర్‌తో వెంకటమ్మ వివాహేతర సంబంధం పెట్టుకుంది. శేఖర్ వెంకటమ్మను ఇబ్బందులకు గురిచేయడంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి ఇద్దరు వేర్వేరుగా ఉంటున్నారు. కాగా సూర్యాపేట పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన గోపి ఈ నెల 17న లక్ష్మయ్య వద్ద ఇంటి నిర్మాణానికి రాయి తీసుకెళ్లాడు. రాయికి సంబంధించిన రూ.3 వేలు ఇవ్వాలని లక్ష్మయ్య గోపిని అడగగా ఇవ్వకపోవడంతో శుక్రవారం చివ్వెంల మండల కేంద్రంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి గోపిని లక్ష్మయ్య అక్కడకు పిలిచాడు. లక్ష్మయ్య మొదటి భార్య వెంకటమ్మ వివాహేతర సంబంధం పెట్టుకున్న శేఖర్ గోపికి స్నేహితుడు కావడంతో అతడు కూడా వచ్చాడు. అక్కడ డబ్బుల విషయం మాట్లాడుతుండగా.. గోపికి స్నేహితుడైన శేఖర్ లక్ష్మయ్యపై దాడి చేశాడు. అనంతరం లక్ష్మయ్య తన ఇద్దరు భార్యలతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వస్తుండగా.. మార్గమధ్యలో చింతలచెరువు కాలువ వద్ద గోపితో పాటు శేఖర్, రాఘవ, చంటి కారులో మాటు వేశారు. చింతలచెరువు కాలువ వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో లక్ష్మయ్య తన బైక్‌లో పెట్రోల్ కొట్టిస్తుండగా.. అక్కడే మాటువేసిన గోపి, అతడి స్నేహితులను లక్ష్మయ్య భార్యలు చూసి అతడికి చెప్పారు. దీంతో లక్ష్మయ్య బైక్‌పై తిరిగి అక్కలదేవిగూడెం వైపు వస్తుండగా కారులో నలుగురు వెంబడించారు. లక్ష్మయ్య, అతడి భార్యలు ప్రాణ భయంతో బీబీగూడెం గ్రామ శివారులో గల మధుర వైన్స్‌లోకి పరిగెత్తారు. అక్కడ ఉన్న వ్యక్తులు వారికి రక్షణ కల్పించడంతో కారులో వచ్చిన వారు పరారయ్యారు. బాధితులు డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. తమకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని లక్ష్మయ్య పోలీసులను వేడుకున్నాడు. ఈ మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

ASTROLOGY

"Free" జ్యోతిష్యం మీ హస్త రేఖం ఫోటో చూసి జాతకం చెప్పబడును. స్త్రీ పురుష "వశీకరణ స్పెషలిస్ట్" ఇంకా ఎటువంటి సమస్యలు ఉన్న ఈ రోజు సంప్రదించండి సెల్: 6361790196. [SCA25007439]

Education

EDUCATION

6 నెలల్లో any డిగ్రీ, PG, డిప్లొమా, B.tech,BAMS,BHMS,D.ఫార్మసీ, B.ఫార్మసీ,LLB,U.G.Cయూనివర్శిటీస్ నుండి పూర్తిచేయండి ☏ 99895 30727 [SCA25007488]

Home Tution చెప్పబడును 6 to 10 Class & Intermediate Maths, Physics, Chemistry, IIT & Neet Coaching ఇవ్వబడును. Special fee for apartments Details for Conctat Cell Number : 8328273254 [SCA25007477]

Real Estate

HOUSE FOR SALE

2, 3 & 4BHK లగ్జరీ విల్లాలు. నివసించుటకు సిద్ధంగా ఉన్నాయి. రూ. 80 లక్షల నుండి, డీ-మార్ట్ పక్కన మిర్యాలగూడ, ఆధునిక సౌకర్యాలు, క్లబ్స్, స్విమ్మింగ్ పూల్. సంప్ర : Ph : 7013578378 [HA-422]

సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. :220/-
అదనపు లైనుకు రూ.: 50/-
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9505508382
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత తప్పనిసరి

• పంచాయతీరాజ్ శాఖ అదనపు కమిషనర్ రవీందర్‌రావు



కొంపల్లి హైస్కూల్‌లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న రవీందర్‌రావు

మునుగోడు: రోజురోజుకు పడిపోతున్న భూగర్భ జలాలను కాపాడుకునేందుకు ప్రతి ఇళ్లలో ఇంకుడు గుంత తప్పనిసరిగా నిర్మించుకోవాలని పంచాయతీ రాజ్ శాఖ అదనపు కమిషనర్ డి.రవీందర్‌రావు అన్నారు. ఉపాధిహామీ పథకం పనుల జాతర కార్యక్రమ ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం మునుగోడు మండలం కొంపల్లిలో నిర్వహించిన గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఉపాధి నిధులు వినియోగించుకోవాలన్నారు. ఇంకుడు గుంత నిర్మించుకున్న వారికి ప్రభుత్వం నుంచి నగదు ప్రోత్సాహం అందజేస్తామన్నారు. ఇళ్లతోపాటు మురుగు కాల్వల ఎండింగ్, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో విధిగా కమ్యూనిటీ ఇంకుడు గుంతలు నిర్మించాలని ఆదేశించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్, మండల పరిషత్ కార్యాలయయంలో నూతన మరుగుదొడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాయలంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శుక్రవారం అర్చకులు విశేషంగా నిర్వహించారు. అనంతరం గరుడ వాహనంపై స్వామి అమ్మవార్లను ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. వ్రతాలకు కావల్సిన పూజా సామగ్రిని హుజూర్‌నగర్‌కు చెందిన బూర్లె ప్రతాప్ దంపతులు, సీహెచ్ ఆనంద్ దంపతులు, మేళ్లచెరువుకు చెందిన వంగవేటి సాయిబాబా దంపతులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ పాల్గొన్నారు.

రాయితీపై యంత్రం.. సాగుకు ఊతం

స్మామ్ పథకంలో భాగంగా రైతులకు అందజేయనున్న కేంద్ర ప్రభుత్వం

• ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఏఈఓలు

చౌటుప్పల్ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం అనేక పథకాలు తీసుకొస్తున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు యంత్ర పరికరాలు మంజూరు చేసేందుకు ముందుకొచ్చింది. ఇందులో భాగంగా సన్న, చిన్నకారు రైతులకు వివిధ యంత్ర పరికరాలు అందించేందకు స్మామ్(సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్) పథకాన్ని తీసుకొచ్చింది. ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

దరఖాస్తు సమర్పణ ఇలా..

స్మామ్ పథకం కింద రాయితీ యంత్ర పరికరాల కోసం ఆయా మండలాల్లో రైతుల నుంచి వ్యవసాయాధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించేందుకు గడువు ఉన్నట్లు సమాచారం. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, మిగిలిన వారికి 40 శాతం సబ్సిడీపై యంత్ర పరికరాలు ఇవ్వనున్నారు. చౌటుప్పల్ మండలానికి 103 యంత్ర పరికరాలు మంజూరు కాగా.. ఇప్పటికి 56 మంది రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 77 బ్యాటరీ స్ప్రే పంపులు ఉండగా కేవలం 10 మంది రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉన్నట్లు జిల్లా వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు సంబంధిత గ్రామ ఏఈఓలకు లేదా మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్, మూడు ఫొటోలు ఇవ్వాల్సి ఉంటుంది. అర్హులకు అందించే సబ్సిడీ నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమకానుంది.

లబ్ధిదారుల ఎంపిక..

లబ్ధిదారుల ఎంపిక కోసం రెండు కమిటీలు ఏర్పాటు చేశారు. మండల స్థాయి కమిటీలో మండల వ్యవసాయ అధికారి నోడల్ అధికారిగా, తహసీల్దార్, ఎంపీడీఓలు సభ్యులుగా ఉండనున్నారు. ఈ కమిటీ రూ.లక్ష లోపు యంత్రాలు కొనుగోలు చేసే రైతులను ఎంపిక చేస్తుంది. రూ.లక్ష కంటే ఎక్కువ ధర ఉన్న యంత్రాల కొనుగోలు చేసే రైతులను జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీ ఎంపిక చేస్తుంది. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ కన్వీనర్‌గా, ఆగ్రోస్ రీజనల్ బ్యాంకు ప్రతినిధి సభ్యుడిగా ఉంటారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



వ్యవసాయ సాగులో యాంత్రీకరణ ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ యంత్ర పరికరాలను స్మామ్ పథకంలో భాగంగా అందిస్తోంది. చౌటుప్పల్ మండలానికి 103 యంత్ర పరికరాలు మంజూరయ్యాయి. వీటి కోసం రైతుల నుంచి ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకున్నాం. అనుకున్న స్థాయిలో దరఖాస్తులు రాలేదు. దీంతో ఆసక్తి ఉన్న రైతులు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుంది.

– ముత్యాల నాగరాజు, మండల వ్యవసాయాధికారి, చౌటుప్పల్